భక్తిశ్రద్ధలతో లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు

కడ్తాల్, మార్చి 6 : తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జాల్ గ్రామంలో కొలువైన వేదాద్రి లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. బుధవారం ఉదయం ఆలయ ప్రధాన ధర్మకర్త నర్సింహశర్మ, ఆలయ నిర్మాణ కర్త శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో గణపతి పూజ, గురువందనం, మహాభిషేకం, లక్ష్మీపుష్పార్చన, మహా సుదర్శన హోమం, సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామి తీర్థప్రసాదాలను భక్తులకు అందజేశారు. అంతకు ముందు గ్రామంలో మూడు రోజులపాటు నిర్వహించే లక్ష్మీనృసింహస్వామి జీవిత చరిత్ర స్టేజీ నాటకాన్ని మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్ ప్రారంభించారు. అంతరించిపోతున్న కళలను కాపాడుతున్న కళాకారులకు ఆయన వ్యక్తిగతంగా రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ రవి, ఎంపీటీసీ అంబాజీ, నాయకులు నారాయణ, వెంకట్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, విష్ణువర్ధన్‌యాదవ్, అశోక్, గోపాలకృష్ణ, నరేందర్‌గౌడ్, పెంటయ్యగౌడ్, శేఖర్, శ్రీను, గోవర్ధన్‌గౌడ్, యాదయ్య, మల్లేశ్, విజయ్, గోపాలకృష్ణ, సుధాకర్, మురళీ, రమేశ్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి సాగు చేస్తున్న వ్యక్తి అరెస్ట్

శంకర్‌పల్లి, మార్చి 6: పంట పొలంలో గంజాయిని పండిస్తున్న వ్యక్తిని సైబరాబాద్ ఎస్‌వోటీ పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటన శంకర్‌పల్లి మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని రావులపల్లి గ్రామానికి చెందిన సుధీర్ (50) తన వ్యవసాయ పొలంలో సాగు చేసిన మక్కజొన్న పంట చుట్టూ 125 గంజాయి మొక్కలను పెంచుతున్నాడు. సైబరాబాద్ రాజేంద్రనగర్ ఎస్‌వోటీ పోలీసులకు సమాచారం రావడంతో ఆకస్మికంగా తనిఖీ చేసి సుధీర్‌ను అదుపులోకి తీసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి మొక్కలను చేవెళ్ల ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నూటొక్క నందులతో నందివనపర్తి

- శివరాత్రికి ఆలయాలు ముస్తాబు
- వందల సంవత్సరాల చరిత్ర గల ఆలయాలు
- వైభవంగా జరుగనున్న ఉత్సవాలు

నందీశ్వరాలయం కల్యాణ మండపం

నందీశ్వర క్షేత్రంలో కొలువుదీరిన మహానంది, శివలింగం

యాచారం, మార్చి 6 : మండల పరిధిలోని నందివనపర్తి గ్రామం ప్రధాన పుణ్యక్షేత్రాలకు నిలయంగా విరాజిల్లుతుంది. గ్రామీణ ప్రాంతంలో దేవాలయాలకు పుట్టినిల్లుగా ప్రఖ్యాతి గాంచింది. వందల ఏండ్ల చరిత్రగల ఆలయాలతో ఆ గ్రామం భక్తి భావాన్ని వెదజల్లుతుంది. అక్కన్న మాదన్న, కాకతీయుల కాలంలో నిర్మించిన ఆలయాలు గ్రామంలో దర్శనమిస్తున్నాయి. ఒకటికాదు రెండు కాదు ఏకంగా నూటొక్క నందులకే నిలయంగా నిలిచింది. గ్రామంలో ఒక శివుని గుడి ఉంటేనే గ్రామస్తులు ఎంతో గొప్పగా భావిస్తారు. అలాంటిది ఒకే గ్రామంలో అత్యంత పురాతనమై వందల ఏండ్ల చరిత్రగలిగిన దేవాలయాలు సిద్ధేశ్వరాలయం, ఓం కారేశ్వరాలయం, నందీశ్వర మహాక్షేత్రం ఉండటం ఎంతో అరుదుగా చెప్పవచ్చును. వీటితో పాటు చెన్నకేశవ ఆలయం, అభయాంజనేయస్వామి ఆలయం, రామాలయం, జ్ఞానసరస్వతి దేవాలయం, గ్రామ దేవతల ఆలయాలు ఉన్నాయి. శివరాత్రి పర్వదినం రోజున గ్రామంలో జాతరలు, బ్రహ్మోత్సవాలతో పండుగ వాతావరణం నెలకొననుంది. గ్రామం మొత్తం శివనామస్మరణతో మారుమ్రోగనుంది.

ఓంకారేశ్వరాలయంలోని శివలింగం

పురాతన ఓంకారేశ్వరాలయం

గ్రామం నడిబొడ్డున అతిపురాతన ఓం కారేశ్వరాలయం ఉంది. వందల ఏండ్ల చరిత్ర గల ఆలయంలో శివ పార్వతులతో పాటు సీతారామాంజనేయ స్వాములు కొలువుదీరారు. ఆలయానికి 1471 ఎకరాల దేవాలయ భూములున్నాయి. శివపార్వతుల పంచలోహ విగ్రహాలున్నాయి. ఆల యం ముందు పురాతన కోనేరు, కల్యాణ మండపం ఎంతో ఆకట్టుకుంటుంది. శివరాత్రి రోజున అఖిలాండకోటి బ్రహ్మాండరూపుడైన ఓంకారేశ్వరుడికి రుద్రాభిషేకం, పార్వతిసమేత ఓంకారేశ్వరుడి కల్యాణ మహోత్సవం, అన్నదానం, ఉత్సవమూర్తుల ఊరేగింపు కార్యక్రమాలు ఉదయం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగనున్నాయి.

సిద్ధమైన సిద్ధేశ్వరాలయం

నందివనపర్తిలో 150 ఏండ్ల చరిత్రగల ఈ ఆలయంలో స్వయం భూ శివలింగం ఉంది. శివలింగంపై సూర్యకిరణాలు పడటంతో ఈ ఆలయం ఎంతో మహిమాన్వితమైందని భక్తులు భావిస్తారు. కాకతీయుల కాలంలో ఆలయం రూపుదిద్దుకున్నట్లు ప్రతీతీ ఆలయం గర్భగుడి పూర్తిగా రాతి నిర్మాణం కావడం, ముందు నుంచి రాతి స్తంభాలతో వెయ్యి స్తంభాల గుడిని తలపిస్తుంది. గర్భగుడిలో పై భాగంలో శ్రీశైలం ఆలయ మాదిరిగా శ్రీచక్రం ఉంది. గర్భగుడిలో ఏకశిలపై స్వయం భూ శివలింగం, ఆలయం ముందు నంది విగ్రహం, అతి పురాతన రాతికట్టడం గల సుందరమైన కోనేరు ఉంది. ఆలయం ఆవరణలో పురాతన నాగులమ్మ, నాగుపాముల ప్రతిమలు రాళ్లపై చెక్కబడి ఉన్నాయి. ఆలయంలో శివరాత్రి రోజు బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయి. ఆలయ పరిసరాల్లో పెద్ద నాగుపాము సంచరిస్తుందని, ఆలయానికి రక్షణగా ఉంటూ అప్పుడప్పుడు శివలింగాన్ని చట్టుకుంటుందని గ్రామస్తులు అంటుతన్నారు. శివరాత్రి రోజున స్వయంభూ శివలింగానికి అభిషేకం, పూజలు, అర్చనలు నిర్వహిస్తారు. శివపార్వతుల కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహిస్తారు. సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలతో ఆలయం కిక్కిరిసి పోతుంది.

పాలేశ్వరాలయంలో ..

మండలంలోని మల్కీజ్‌గూడ గ్రామంలో కొలువుదీరిన పాలేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగనున్నాయి. ఆలయంలో అన్నదానం, వ్రతాలు, పల్లకిలో స్వామివారి ఊరేగింపు కార్యక్రమాలు నిర్వాహకులు డేరంగుల నర్సింహ్మ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. మండలంలోని గున్‌గల్, గాండ్లగూడ, నల్లవెల్లి తదితర గ్రామాలలో శిరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు.

సిద్ధేశ్వరాలయం ముందున్న పురాతన కోనేరు

మైసమ్మతల్లిని దర్శించుకున్న ఎంపీ రాములు



మైసిగండి మైసమ్మతల్లి సన్నిధిలో ఎంపీ పోతుగంటి రాములు

కడ్తాల్, మార్చి 6 : మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ దేవతని బుధవారం నాగర్‌కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములు దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ సిబ్బంది ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. అనంతరం ఆయన కాశీవిశ్వనాథుడి బ్రహ్మోత్సవాల పోస్టర్లు, పత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, నాయకులు గూడూరు గోపాల్‌రెడ్డి, రాంరెడ్డి, మాన్యానాయక్, లక్ష్మణ్‌నాయక్, శ్రీకాంత్‌సింగ్, శంకర్ నాయక్, శ్రీశైలంగౌడ్, ఆలయ సిబ్బంది యాదగిరిస్వామి, కృష్ణ, రాములు, చంద్రయ్య, దేవేందర్ పాల్గొన్నారు.

వైభవంగా శివ మాలధారుల ఇరుముడిధారణ

కడ్తాల్, మార్చి 6 : శివమాలధారులు బుధవారం శివాలయాల్లో ఇరుముడిధారణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. వివిధ రకాల పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని శివాలయంలో గురుస్వాములు శేఖర్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి స్వాములకు ఇరుముడిధారణ నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని జడ్పీటీసీ దశరథ్‌నాయక్ బియ్యం అందించగా, వైస్ ఎంపీపీ ఆనంద్ రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

వాటర్‌మెన్స్, ఎలక్ట్రిషియన్ల కార్యవర్గం ఎన్నిక

నూతనంగా ఎన్నికైన వాటర్‌మెన్స్, ఎలక్ట్రిషియన్ కమిటీ సభ్యులు

పెద్దఅంబర్‌పేట, మార్చి 6: మున్సిపాలిటీ వాటర్‌మెన్స్, ఎలక్ట్రిషియన్స్ కమిటీ అధ్యక్షుడిగా దానయ్య ఎన్నికయ్యారు. బుధవారం మున్సిపాలిటీలోని కుంట్లూరు వార్డు ఆఫీస్ ఆవరణలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా కే రవి, ఉపాధ్యక్షులుగా ఈశ్వరయ్య, శేఖర్, సహాయ కార్యదర్శులుగా నరసింహ, స్వామి, కోశాధికారిగా శ్రీను, నరేశ్, గౌరవ అధ్యక్షుడిగా పాండు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు ఏర్పులు నరసింహ మాట్లాడుతూ.. ఎలక్ట్రిషియన్స్, వాటర్‌మెన్స్‌కు కనీస వేతనం అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. మొత్తం 17 మందితో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు చెప్పారు.

దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలి

అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఐ నాగరాజు

శంకర్‌పల్లి, మార్చి 6: దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని శంకర్‌పల్లి డీఐ నాగరాజు అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని బస్టాండ్ ఆవరణలో ప్రయాణికులకు సైబర్ నేరాలు, దొంగతనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అత్యవసర సమయాల్లో ప్రజలు 100 నంబర్‌కు డయల్ చేయాలని సూచించారు. పరిచయం లేని వ్యక్తులు ఏమైనా తినుబండారాలు ఇస్తే తీసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పట్టా ఆధారంగానే నిర్మాణం.. కూల్చివేత సరికాదు

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 6 : భూదాన్ బోర్డు తమకు ఇచ్చిన పట్టాల ఆధారంగానే ఇండ్లు నిర్మించుకున్నామని, అధికారులు కూల్చి వేయడం సరికాదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. జాఫర్‌గూడలోని సర్వే నెం 319లో బాధితులు బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. స్థానికంగా ఉండే ఓ వ్యక్తి రెవెన్యూ అధికారులకు ఇచ్చిన తప్పుడు సమాచారం వల్లే కూల్చివేశారని వారు ఆరోపించారు. 2014లో కోర్టు ఆదేశం ప్రకారం నివాసాలను ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. అన్యాయంగా ఎనిమిది మంది ఇండ్లను కూల్చి వేసి రోడ్డు పాలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బాధితులు బానుభేగం, సయ్యద్‌పాష, పద్మ, జ్యోతి, మణెమ్మ, దివ్య, మహిమూద్ తదితరులు పాల్గొన్నారు.

రావులపల్లిలో ఉచిత వైద్య శిబిరం

ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న గ్రామస్తులు

చేవెళ్ల రూరల్, మార్చి 6 : మండల పరిధిలోని రావులపల్లి గ్రామంలో బుధవారం పీఎంఆర్ దవాఖాన సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 200 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కేసారం శ్రీనివాస్, పీఎంఆర్ దవాఖాన వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత.. ముగ్గురి అరెస్టు

ఆమనగల్లు, మార్చి 6: గంజాయిని సరఫరా చేస్తున్న ముగ్గురు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. 1.227 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని వారిని రిమాండ్‌కు పంపించారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ ప్రమోద్‌కుమార్, ఎస్సై బాల్‌రామ్ వివరాలు వెల్లడించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తికి చెందిన నందిపేట అఖిలేశ్ మంగళవారం రాత్రి హైదరాబాద్ నుంచి కల్వకుర్తి వెళ్తున్న ఆర్టీసీ బస్సులో గంజాయిని తీసుకెళ్తున్నాడని పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో ఎస్సై సిబ్బందితో కలిసి తనిఖీ చేసి అఖిలేశ్‌ను అదుపులోకి తీసుకొని 1.144 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కల్వకుర్తికి చెందిన సయ్యద్ నాసర్, చాపల రంజిత్ సహకరించినట్లు ఒప్పుకున్నాడు. వారిని కూడా అదుపులోకి తీసుకొని 83 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ముగ్గురిని కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ప్రమోద్‌కుమార్ తెలిపారు. కేసులో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులను అభినందించారు.

ఎల్ ఆర్ ఎస్ పేరుతో వేధిస్తే ఊరుకోం

- మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

షాద్‌నగర్, మార్చి 6: ఎల్ఆర్ఎస్ పేరుతో ప్రజలను వేధిస్తే ఊరుకునేది లేదని మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ పేరుతో ప్రజల నుంచి డబ్బుల వసూళ్లను వ్యతిరేకిస్తూ బుధవారం స్థానిక బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. పేద ప్రజల రక్తం తాగేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమైందని ఆయన తీవ్ర స్థాయిలో విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మేము అధికారంలోకి వస్తే ఎల్ఆర్ఎస్ ద్వారా ఉచితంగా ప్లాట్లను రెగ్యులరైజ్ చేస్తామని ప్రకటించిన రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీతక్క, కొమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలు అధికారంలోకి రాగానే వారు ఇచ్చిన హామీలను మర్చిపోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. ఎల్ఆర్ఎస్ పేరుతో ప్రజల రక్తం తాగుతారా? అని అప్పట్లో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన నేటి ప్రభుత్వ మంత్రులు వారు చేసిన మాటలను గాలికి వదిలేసి నేడు పేద ప్రజల రక్తం తాగేందుకు సిద్ధమయ్యారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో 20 లక్షల కుటుంబాలు ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసకున్నారని, వారందరికి ఉచితంగా ప్లాట్లను క్రమబద్ధీకరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎల్ఆర్ఎస్‌కు సంబంధించి ప్రజల నుంచి డబ్బులను వసూలు చేస్తే ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో జడ్పీ వైస్ చైర్మన్ గణేశ్, మున్సిపల్ చైర్మన్ నరేందర్, సహకార సంఘాల కార్పొరేషన్ మాజీ చైర్మన్ రాజావరప్రసాద్, పీఏసీఎస్ చైర్మన్ బక్కన్న యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నారాయణరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, కౌన్సిలర్లు యుగేందర్, శ్రీనివాసులు, శ్రీనివాస్, సలివేంద్రంరాజు, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, సుదీర్, శంకర్, నారాయణయాదవ్, నర్సింగరావు, వెంకట్‌రెడ్డి, రవియాదవ్, రామకృష్ణ, వెంకట్‌రెడ్డి, శ్రీశైలంగౌడ్, రంగయ్యగౌడ్, పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన మహిళా కండక్టర్లకు ప్రశంస పత్రాలను అందజేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి

షాద్‌నగర్‌టౌన్, మార్చి 6 : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని షాద్‌నగర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. షాద్‌నగర్ బస్టాండ్ ఆవరణలో బుధవారం డీఎం ఉష ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా దినోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు పురుషులకు దీటుగా అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. ఆడపిల్లలను చదువుల్లో ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. బస్టాండ్ ఆవరణలో కేక్ కట్ చేశారు. అనంతరం విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన మహిళా కండక్టర్లను సన్మానించి ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

స్వశక్తితో ముందుకు సాగాలి

ఇబ్రహీంపట్నంరూరల్ : మహిళలు స్వశక్తితో ముందుకు సాగినప్పుడే అన్ని రంగాల్లో రాణిస్తారని తహసీల్దార్ సునిత అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఆర్టీసీ ఆధ్వర్యంలో బస్టాండ్‌లో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. పలువురిని సన్మానించారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం వెంకటనర్సప్ప, ఆర్టీసీ మహిళా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇంటర్ వార్షిక పరీక్షలు

షాద్‌నగర్‌టౌన్, మార్చి 6 : షాద్‌నగర్ పట్టణంలో ఇంటర్ వార్షిక పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. బుధవారం పరీక్ష కేంద్రాల్లో 1303 మంది సాధారణ విద్యార్థులకు 1249 మంది, 496 మంది ఒకేషనల్ విద్యార్థులకు 459 మంది హాజరయ్యారు. పట్టణంలోని విశ్వభారతి, ప్రతిభా కళాశాలను అధికారులు తనిఖీ చేశారు.

ఇన్‌చార్జి టీపీవో అలి పాషా డీటీసీపీకి సరెండర్

తుర్కయాంజాల్, మార్చి 6 : తుర్కయాంజాల్ మున్సిపాలిటీ ఇన్‌చార్జి టౌన్ ప్లానింగ్ విభాగం అధికారి అలి పాషాను డీటీసీపీ ప్రధాన కార్యాలయంలో సరెండర్ చేసినట్లు మున్సిపాలిటీ కమిషనర్ సత్యనారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కొంత కాలంగా అలి పాషాపై అవినీతి ఆరోపణలు రావడం, విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు సరెండర్ చేసినట్లు కమిషనర్ పేర్కొన్నారు.

సీఐగా బాధ్యతల స్వీకరణ

షాబాద్, మార్చి 6: షాబాద్ నూతన సీఐగా బి.కాంతారెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకు ముందు ఇక్కడ సీఐగా పనిచేసిన యాదయ్యగౌడ్ బదిలీపై ఇటీవల జినమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ కు వెళ్లారు. నార్సింగి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ లో సెక్టార్ సీఐగా పనిచేస్తున్న కాంతారెడ్డి బదిలీపై షాబాద్‌కు వచ్చారు.

స్వపరిపాలన దినోత్సవం

ఆమనగలు, మార్చి 6 : ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని ఆమనగల్లు గ్రామర్ హైస్కూల్‌లో బుధవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు బోధించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులను అందజేశారు.

కొహెడ పాఠశాలలో మాక్ పోలింగ్

తుర్కయాంజాల్, మార్చి 6: తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని కొహెడ ప్రభుత్వ పాఠశాలలో బుధవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఎన్నికల నిర్వహణ, పోలింగ్, ఈవీఎంపై ఓటింగ్ విధానం, కౌంటింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల హెచ్ఎం తిరుపతి పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులందరూ పాల్గొని ఓటు వేశారు. అనంతరం హెచ్ఎం మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణపై విద్యార్థులకు అవగాహన కల్పించడానికి మాక్ పోలింగ్ నిర్వహించామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు దన్నె రాజు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా నిర్వహిస్తే చర్యలు

తుర్కయాంజాల్, మార్చి 6 : అనుమతులు లేకుండా పెట్రోల్ బంకులను నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రఘునందన్ అన్నారు. బుధవారం సాగర్ ప్రధాన రహదారి ఇంజాపూర్, బీఎన్‌రెడ్డి, తుర్కయాంజాల్‌లోని పెట్రోల్ బంకులలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.

పీర్ల మాన్యం భూమిని సంరక్షించాలి

ఆమనగల్లు, మార్చి 6: ఆమనగల్లులో పీర్లమాన్యం (మస్రూతి ఇనాం) భూమి ఆక్రమణకు గురికాకుండా సంరక్షించాలని కోరుతూ బుధవారం ఇనాందారులు మొహినొద్దీన్, గౌసుద్దీన్, మొహిద్దీన్, తాహిరుద్దీన్, ఫక్రుద్దీన్ తదితరులు తహసీల్దార్ లలిత, మున్సిపల్ కమిషనర్ వసంతకు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు.

పట్టణంలోని పీర్ల మాన్యంకు చెందిన భూమిని కొందరు వ్యక్తులు ఆక్రమించుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారని, ఈ భూమి అన్యక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో షేక్ హమీద్, రెహన బేగం, షాబుద్దీన్ తదితరులు ఉన్నారు.

ప్రతిభను వెలికితీసేందుకు క్రీడలు దోహదం

మొయినాబాద్, మార్చి 6 : విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీయడానికి కళలు, క్రీడలు ఎంతో దోహదపడుతాయని కేజీరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ రోహిత్ కందకట్ల అన్నారు. మండల పరిధిలోని చిలుకూరు రెవెన్యూలోని కేజీరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఇన్విక్టా-2024 సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాలు బుధవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాలోని ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు కార్యక్రమాల్లో పాల్గొని వారి ప్రతిభను చూపారన్నారు. గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సత్యనారాయణ, నిర్వాహకులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దరఖాస్తులను పరిశీలించి పరిష్కరిస్తాం

అజీజ్‌నగర్ గ్రామంలో సమస్యలను తెలుసుకుంటున్న తహసీల్దార్ గౌతమ్‌కుమార్

మొయినాబాద్, మార్చి 6 : పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను పరిశీలించి పరిష్కరిస్తామని తహసీల్దార్ గౌతమ్‌కుమార్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని అజీజ్‌నగర్, నాగిరెడ్డిగూడ, బంగాలిగూడ గ్రామాల్లో తహసీల్దార్ గౌతమ్‌కుమార్, హిమాయత్‌నగర్, దేవులపల్లి గ్రామాల్లో నాయబ్ తహసీల్దార్ వినోద్‌కుమార్ పర్యటించారు. ధరణి భూ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకున్న రైతులను నేరుగా కలిసి పరిశీలించారు. తహసీల్దార్ పరిధిలో ఉన్న సమస్యలను మండల స్థాయిలో పరిష్కరిస్తామని, జిల్లా స్థాయిలో పరిష్కరించాల్సిన సమస్యలు ఉంటే అట్టి భూములకు సంబంధించిన నివేదికను తయారు చేసి జిల్లా రెవెన్యూ అధికారి, జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐలు చంద్రమోహన్, రోజా, సీనియర్ అసిస్టెంట్ సురేందర్ తదితరులు పాల్గొన్నారు.